క్లుప్తంగా

154 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ నరసింహ

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేటలో గురువారం రాజమహేంద్రవరంలోని డెల్టా హాస్పిటల్ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో 154 మందికి డాక్టర్ నరసింహ వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి పలు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెటింగ్ డీజీఎం శివ ప్రసాద్, ఏరియా మార్కెటింగ్ మేనేజర్ రాము, దొరబాబు, అభిరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాజానగరం: గైట్ డిగ్రీ కళాశాలలో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జీఎస్ఎల్ దంత వైద్య కళాశాల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీ మాధవి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దంత సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మొదటి రోజు 150 మందికి వైద్య పరీక్షలు చేసి, 86 మందికి ఫిల్లింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ కె.కాశీకృష్ణ, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గంటా సునీల్, హెచ్ఓడీ రమేష్, లెక్చరర్ మౌనికారెడ్డి, క్యాంప్ కో ఆర్డినేటర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు



చంద్రేడులో రైతులకు శనగ విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి

రంగంపేట: మండలంలోని చంద్రేడు గ్రామానికి 10 టన్నులు, పెదరాయవరం గ్రామానికి 15 టన్నుల శనగ విత్తనాలు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి ఏడీఏ డీవీ కృష్ణ తెలిపారు. మండల పరిధిలోని చంద్రేడు, పెదరాయవరం గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్కు సంబంధించి వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని తమకు నచ్చిన రైస్ మిల్లులకు తరలించుకోవొచ్చన్నారు. ధాన్యం తరలించే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి అన్నారు. ఉద్యానవన అధికారి కె.దివ్యశ్రీ మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్లు రాయితీపై అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం రైతులకు శనగ విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్లు జాస్తి వెంకట పద్మావతి, బరగటి సుజాత, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ పోలియో దినోత్సవం



పోలియోను తరిమికొడదామని నినాదాలు చేస్తున్న సీతానగరం పీహెచ్సీ సిబ్బంది

సీతానగరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ పోలియో దినోత్సవం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ పోలియో మైలైటిస్ అనే క్రిమి ద్వారా 15 ఏళ్ల లోపు పిల్లలకు వచ్చే వ్యాధి పోలియో అన్నారు. ఇది సోకిన పిల్లల్లో శాశ్వత అంగవైకల్యం సంభవిస్తుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలందరికీ విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సారా కేసులో మహిళకు రిమాండ్

సీతానగరం: మండలంలోని నల్గొండ గ్రామంలో సారా విక్రయిస్తున్న జిలిపె అరవాలమ్మను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని ఎస్సై డి.రామ్కుమార్ తెలిపారు. నల్గొండలోని ఇంటి వద్ద అరవాలమ్మ సారా విక్రయిస్తుండగా గురువారం ఉదయం దాడి చేసి పట్టుకున్నామన్నారు. ఆమె నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అన్నదాతలకు అందని భరోసా

- కూటమి ప్రభుత్వంలో రైతులకు అందని సాయం
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామంటూ చంద్రబాబు హామీ
- అధికారంలోకి వచ్చాక పథకం ఊసెత్తని ప్రజాప్రతినిధులు



పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతులు

బిక్కవోలు: రైతన్నను సాగు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ముగింపునకు వచ్చేసినా ఇంతవరకూ రైతులకు పెట్టుబడి సాయం అందనే లేదు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా అన్నదాతలకు పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు చొప్పున అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అయితే గద్దె నెక్కిన తరువాత సదరు హామీని గాలికొదిలేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కేసిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వం అన్నదాతలను చిన్నచూపు చూస్తుందన్న విమర్శలు అన్ని వర్గాల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో

సాగు కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం అందించి అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా రూపేణా మరో రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఆఖరికి కౌలు రైతులకు సైతం వైఎస్సార్ రైతు భరోసా అందజేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు ఇస్తామన్న రూ.20,000 సాయం ఊసే ఎత్తడం లేదు. కేంద్ర ప్రభుత్వం మాత్రం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి రెండు విడతల్లో రూ.4 వేలు జమ చేసింది. అయితే రాష్ట్రం తరపున అందిస్తామని చంద్రబాబు గుప్పించిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. ఒకపక్క ఖరీఫ్ చివరి దశకు చేరుకున్నా పెట్టుబడి సాయం గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్ నోరెత్తకపోవడంపై అన్నదాతలంతా మండి పడుతున్నారు.

పంట రుణాలకు పాట్లు

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్లో 63,835 ఎకరాల్లో సాగు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ను ఆమోదించడంలో జాప్యం కారణంగా బ్యాంకుల్లో పాత రుణాలను రెన్యువల్ చేయడం మినహా కొత్తగా రుణాలు మంజూరు కావడం లేదు. దీంతో సేద్యం కోసం రైతులంతా ప్రైవేట్ ఫైనాన్స్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తోంది. అధిక వడ్డీల భారం మోయాల్సిన దుస్థితి దాపురించింది. ఇంట్లో బంగారు నగలను తాకట్టు పెట్టుకుని వ్యవసాయ పనులు సాగించాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ సాయం విడుదల కాకపోవడంతో 30,327 మంది అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. అన్నదాత సుఖీభవ అంటూ పథకానికి పేరు మార్చడంలో చూపించిన తొందర రైతులకు సాయం అందించడంలో మాత్రం కనిపించడం లేదు.

అనపర్తి నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం, రైతుల వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
అనపర్తి	9,967	5,312
బిక్కవోలు	16,503	8,635
రంగంపేట	19675	8,928
పెదపూడి	17,690	7,452
మొత్తం	63,835	30,327

పెట్టుబడికి సాయం అందించాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏటాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించేది. ఈ ఏడాది ఖరీఫ్ చివరి దశకు వచ్చినా పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తామన్నా రూ.20 వేలు అందజేస్తే కనీసం రబీ సాగుకైనా ఉపయోగపడుతుంది.

– తాళ్ల నిరంజన్రెడ్డి, రైతు, బిక్కవోలు

కాప్స్తో నన్నయ వర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న కాప్స్, నన్నయ అధికారులు

రాజానగరం: సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్)తో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. దీనికి సంబంధించిన పత్రాలను ఇన్చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు సమక్షంలో కాప్స్ సెక్రటరీ ఓలేటి సత్యనారాయణ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పరస్పరం మార్చుకున్నారు. ఇన్చార్జ్ వీసీ మాట్లాడుతూ విద్యా సంబంధ విషయాలు, పరిశోధనలు, ప్రచురణ సహకారాలకు సంబంధించిన అంశాలతో ఉభయ సంస్థల మధ్య ఈ ఒడంబడిక కుదిరిందన్నారు. త్వరలో కాప్స్ సహకారంతో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం సదస్సును నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య కేఎస్ రమేష్, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.పెర్సిస్, ఆచార్య కె.రమణేశ్వరి, ఆచార్య కేవీ స్వామి, డాక్టర్ సజనారాజ్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



జి.మామిడాడ సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ శ్రీనివాసరావు

పెదపూడి: లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. జి.మామిడాడ గ్రామంలోని లేఅవుట్-1లో గురువారం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మండలంలో 2727 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయన్నారు. వారిలో 808 మంది నిర్మాణాలు పూర్తి చేశారని, మరో 510 మంది ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వాటిని సత్వరమే పూర్తి చేయడానికి డ్వాక్రా సంఘాల నుంచి స్త్రీనిధి పథకం, బ్యాంక్ నుంచి రుణాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. లబ్ధిదారులంతా ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ, పంచాయతీ అధికారి ప్రసాద్, హౌసింగ్ అధికారి లంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై దరఖాస్తు చేసుకోవాలి



రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ సీతాపతిరావు



మెళ్లూరులో గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

పెదపూడి: భూ విస్తీర్ణంలో తేడాలు, రీసర్వే జరిగిన గ్రామాల్లో రైతులకు ఇచ్చిన రికార్డుల్లో నమోదైన తప్పులు, భూసమస్యల పరిష్కారానికి రైతులు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. ఏపీత్రయం గ్రామంలో గురువారం రీసర్వే గ్రామ సభ సర్పంచ్ అడబాల అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీతాపతి రావు మాట్లాడుతూ భూములకు సంబంధించి ఏ విధమైన సమస్య ఉన్నా అర్జీ దాఖలు చేసి పరిష్కారం పొందవచ్చన్నారు. గ్రామ సభలో 52 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చిట్టి తల్లి, వీఆర్వోలు కరెడ్ల రమేష్బాబు, గొల్లపల్లి అంజిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు పెండెం జ్ఞాన ప్రసూన, అరిమిల్లి సత్యభారతి ప్రసాద్, అడబాల పెద్దకాపు, అడబాల విష్ణు, పెండెం అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

బిక్కవోలు: రీ సర్వే జరిగిన గ్రామాల్లో నెలకొన్న భూసమస్యలను పరిష్కరించడం కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఇన్చార్జి తహసీల్దార్ కృష్ణ తెలిపారు. గురువారం మెళ్లూరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ రైతులంతా గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మెళ్లూరు గ్రామ సభలో 53 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు అందించారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి కుమార్ పాల్గొన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

పెదపూడి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రీసర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలో రీసర్వే రెవెన్యూ గ్రామ సభను గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు భూ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు అందించి పరిష్కారం పొందాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



దోమాడలో ధర్నా చేస్తున్న బాధితురాలు, ప్రజా సంఘాల నాయకులు

పెదపూడి: దోమాడ గ్రామంలో చెరువుగట్టుపై నివాసం ఉటున్న షేక్ అమ్మాజీ ఇల్లు కూల్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దోమాడలో ఇల్లు కూల్చిన చోట సీపీపీ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, దళిత ప్రజా చైతన్యం, ఎమ్మార్పీఎస్, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టీయూ) ప్రజా సంఘాల అధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. బాధితురాలు అమ్మాజీ మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇంటిని దౌర్జన్యంగా కూల్చిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఈ మేరకు పోలీస్స్టేషన్లో, తహసీల్దార్కు ఫిర్యాదు చేశామన్నారు. సదరు ఇంటి వెనుక ఉన్న లేఅవుట్ నిర్వాహకులే ఇంటిని కూల్చారని ఆరోపించారు. కార్యక్రమంలో గుబ్బల ఆదినారాయణ మూర్తి, మందలపల్లి సత్యనారాయణ, రాగుల రఘువులు, బుంగా సతీష్, ఎల్లే సత్యనారాయణ, పెండ్యాల రాము, బొచ్చా యేసు పాల్గొన్నారు.

దేశ సంస్కృతిని కాపాడాలి



జి.మామిడాడ సమావేశంలో మాట్లాడుతున్న రామశంకర్

పెదపూడి: ప్రతిఒక్కరూ మన దేశ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని సమరసత సేవా ఫౌండేషన్ గోదావరి జోన్ కన్వీనర్ బండ రామ్శంకర్ కోరారు. జి.మామిడాడ గ్రామం సూర్యదేవాలయంలో గురువారం కాకినాడ నగరం, కాకినాడ రూరల్, పెదపూడి మండలాలకు చెందిన గ్రామ కన్వీనర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్శంకర్ మాట్లాడుతూ దేశం బయట విదేశీ శక్తుల నుంచి మన దేశాన్ని రక్షించడం కోసం సరిహద్దులో సైన్యం ఉందన్నారు. అలాగే దేశం లోపం దేశాన్ని, ధర్మాన్ని రక్షించడం కోసం ఎవరున్నారని ప్రశ్నించారు. మన దేశాన్ని మన కుటుంబంగా భావించి విదేశీ సంస్కృతి నుంచి దేశ సంస్కృతిని కాపాడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గోదావరి జోన్ ప్రచార ప్రముఖ్ నందేరి కృష్ణ, జిల్లా ధర్మ ప్రచార్ పడాల రఘు, జిల్లా పరియోజన సహ ప్రముఖ్ భీమన ఛత్రపతి శివాజీ, ఝాన్సీరాణి, మండల కన్వీనర్ కరెడ్ల చక్రి, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

మా ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించండి



తమ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇప్పించాలని ఎమ్మెల్యే బలరామకృష్ణను వేడుకుంటున్న లబ్ధిదారులు

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఎంతో ఆర్భాటంగా నిర్వహించిన ×ప్రజావాణి సమస్యలపై పరిష్కార వేదిక× కార్యక్రమం ప్రజా సమస్యలకు పరిష్కారం చూపకుండానే ముగిసిపోయింది. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొన్న ఈ కార్యక్రమంలో తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందవచ్చని ఎదురుచూసిన జనానికి నిరాశే మిగిలింది. ముఖ్యంగా గ్రామంలో సాయిబాబా గుడికి సమీపంలో గత ప్రభుత్వం కొంతమంది పేదలకు నివాస స్థల పట్టాలను పంపిణీ చేసింది. వాటిలో కొంతమంది సొంత వ్యయంతో ఇళ్లు కట్టుకున్నారు. అయితే వారికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. దీంతో తమ ఇంట వెలుగులు నింపేలా చూడాలని ఎమ్మెల్యేను సంబంధిత లబ్ధిదారులు వచ్చి వేడుకున్నారు. అయితే ఆయన వారి సమస్యను మానవీయ కోణంలో చూడకుండా రాజకీయంగా చూశారు. గతంలో జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఈ స్థలాల విషయం కోర్టులో ఉన్నంతున తానేమీ చేయలేనంటూ నిస్సాయతను వ్యక్తం చేశారు. ఇటీవల ఇక్కడకు వచ్చిన సమయంలో జిల్లా కలెక్టరును కోరగా నిర్మాణ పనులు పూర్తయిన ఇళ్లకు కరెంటు సరఫరా ఇమ్మని చెప్పారనే విషయాన్ని లబ్ధిదారులు ప్రస్తావించడంతో విసుగు చెందిన ఎమ్మెల్యే కోర్టులో కేసు పెండింగ్లో ఉన్నంత వరకు తానేమీ చేయలేనంటూ చేతులెత్తేశారు. దీనితో లక్షల రూపాయలు అప్పులు చేసి మరీ ఇళ్లు కట్టుకున్నామని, వాటిలో నివాసం ఉండే యోగం లేదంటూ లబ్ధిదారులు కన్నీటి పర్యంతమవుతూ ఆ వేదిక నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్జే ఝాన్సీ, తహసీల్దారు లక్ష్మీలావణ్య పాల్గొన్నారు.

27న ఫ్లోటింగ్ రెస్టారెంట్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటక శాఖ సౌజన్యంతో గోదావరిపై తొలిసారిగా ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ రెస్టారెంట్ ఈ నెల 27న ప్రారంభం కానుంది. సిల్వర్ స్వాన్ రెస్టారెంట్ అండ్ ఎంటర్టైన్ మెంట్స్ నిర్వహణలో తొలిసారిగా గోదావరి ఇసుక తిన్నెల్లో రెస్టారెంట్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభోత్సవం చేస్తారు. ఉమామార్కండేయస్వామి ఆలయం సమీపంలోని లాంచీల రేవు నుంచి ఏపీ టూరిజం బోటులలో ప్రయాణించి, ఇసుక తిన్నెల దగ్గర గల ఫ్లోటింగ్ రెస్టారెంట్ వద్దకు చేరుకోవాలి.

నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ నరసింహ కిశోర్
- కడియం పోలీస్ స్టేషన్ తనిఖీ



కడియంలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ కిశోర్

కడియం: జిల్లాలో నేరాల అదుపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కడియం పోలీస్ స్టేషన్ను సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల ప్రగతిని ఇన్స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. నమోదైన ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సంబంధిత కేసు ప్రగతిని ఆరా తీశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పరిధిలోని జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో కలిసి కార్యాచరణ చేపడుతున్నామన్నారు. గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద భద్రతా పరమైన మార్పులు, చేర్పులను చేస్తామన్నారు. అలాగే యూత్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రజలతో మమేకమై, శాంతిభద్రతల పరిరక్షణకు ఇది దోహదపడుతుందన్నారు. ఉమెన్ రక్షక్ బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. నేరాల అదుపు, దర్యాప్తులో సీసీ కెమెరాల ప్రాధాన్యతను గుర్తించి, విస్తృతంగా వాటిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కడియం పోలీస్ స్టేషన్ పరిధిలో సెక్షన్ 174 కింద నమోదైన కేసులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా మహిళలు ఆత్మహత్యలకు పాల్పడే ఘటనలు ఎందుకు జరుగుతున్నాయి, వాటిని నివారించేందుకు ఏం చేయాలన్నదానిపై చర్చించి, మహిళా సిబ్బంది సహకారంతో తగిన కార్యాచరణను అమలు చేస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి నర్సరీల్లో పనులు చేసుకునేందుకు వచ్చే మహిళలకు అవగాహన కార్యక్రమాలు అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. స్టేషన్ పరిధిలో పలు చోరీలకు సంబంధించి రికవరీని సాధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. అంతకు ముందు వేమగిరి జంక్షన్ పోలీస్ అవుట్ పోస్టును పునఃప్రారంభించారు. ఆయన వెంట దక్షిణ మండలం డీఎస్పీ భవ్య కిశోర్, కడియం ఎస్సైలు దుర్గాప్రసాద్, ధనలక్ష్మి ప్రసన్న ఉన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో జరిగే అన్నదాన కార్యక్రమంలో భాగంగా గురువారం దాతల సహకారంతో 150 మంది నిరుపేదలకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. సేవా సమితి సభ్యులు నేరుగా పేదల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రంగంపేట: రంగంపేట విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు రాజమహేంద్రవరం రూరల్ విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీధర్వర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదరాయవరం ఫీడర్ పరిధిలోని చంద్రేడు, వెంకటాపురం, కోటపాడు, పెదరాయవరం గ్రామాలకు, వడిశలేరు రూరల్ ఫీడర్ పరిధిలో ముకుందవరం గ్రామానికి, ఈలకొలను ఫీడర్ పరిధిలోని ఏజీఎల్ సర్వీసులు, అచ్యుతాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

నేడు పశు వైద్య శిబిరం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు పశు వైద్యశాల వద్ద శుక్రవారం ఉచిత పశువుల శిబిరంతో పాటు 21వ అఖిల భారత పశు గణన నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి ప్రణీత్ తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హసినిని అభినందిస్తున్న దృశ్యం

పెదపూడి: తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎ.హసిని ఆయన అనపర్తి లో విలేకరులతో గురువారం మాట్లాడారు. స్కూల్గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 షాట్ పుట్ విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని అనపర్తి జీబీఆర్ పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామారావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని జీబీఆర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ తేతలి కొండబాబు, యాజమాన్య సభ్యులు గొలుగూరి రామారెడ్డి, జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ డీన్ జి.హరిప్రసాద్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం భువనేశ్వరి, ప్రీప్రైమరీ హెచ్ఎం కామాక్షి, వరలక్ష్మి, ఏఓ ఆచారి తదితరులు అభినందించారు.

ప్రతి ఒక్కరికీ బీఎల్ఎస్ శిక్షణ అవసరం



డాక్టర్ చంద్రమౌళిని సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరికీ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బీఎల్ఎస్) శిక్షణ అవసరమని రాజమండ్రి అడ్వాన్స్ క్రిటికల్ కేర్ (ఆర్ఏసీసీ) హాస్పిటల్ వైద్య నిపుణులు డాక్టర్ తాటికొండ చంద్రమౌళి అన్నారు. కమ్యూనిటీ పారా మెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం హుకుంపేట గోదావరి రుచుల కాన్ఫరెన్స్లో సమావేశం నిర్వహించారు. దీనికి రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ఖాన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలను కాపాడటంలో బీఎల్ఎస్ ప్రధానమైందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రతి పీఎంపీ సంఘ పరిధిలోనే సేవలందించాలని, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సహాయ కార్యదర్శి కె.జనార్దన్, రాష్ట్ర మీడియా కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి మట్టా రమేష్ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ చంద్రమౌళిని, ఇటీవల జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వీబీటీ రాజు, జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తోరాటి ప్రభాకర రావు, జాతీయ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన కె.జనార్దన్ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి

కంబాలచెరువు: కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 35 వేల పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ వెంటనే విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు వి.రాంబాబు, డి.అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. ఇన్నీసుపేటలోని బాలోత్సవ భవన్లో ఈ నెల 26న జరగనున్న డీవైఎఫ్ఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం డీవైఎఫ్ఐ నాయకులు పోస్టర్ విడుదల చేశారు. వి.రాంబాబు, డి.అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.రాము హాజరవుతారన్నారు. భగత్సింగ్, మన్యం విప్లవీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో 1980 నవంబర్లో పంజాబ్లోని లూథియానాలో డీవైఎఫ్ఐ ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల గారడీ చేస్తోందని, రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.